ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY 5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

ఆదివారం 11 మే 2025



నాన్న నివాళి



గుండె పగిలిన తండా..!

స్వగ్రామానికి వీరుడి పార్థివ దేహం

బెంగళూరు నుంచి పోటెత్తిన ప్రజానీకం

చెప్పాం కదా..! నువ్వు ఒక్కడివి కాదని..
ఒక్కగానొక్క కొడుకువి కానేకాదని..
నీకు ముందూ వెనుక
కోటాను కోట్లుగా ఉన్నామని..!
ఆకాశపు లోకాన..
అమరపురి అంచుల నుంచి..
మన నేలవైపు నువ్వు చూశావుగా..
నీకై తడవని కన్ను.. హృదయం
ఒక్కటైనా కనిపించిందా..?

నువ్వు నడిచిన నేల
కన్నీటి సంద్రమైంది
నిన్నుగన్న తల్లి..
చేష్టలుడిగి చూస్తోంది..!
గుండె బద్దలౌతున్నా.. నాన్న
నిశ్శబ్ద సంద్రమై నిలిచాడు..!

రేయి నీకు నివాళిగా మేల్కొంది..
నీ వీడ్కోలుకు వేకువను వెలిగిస్తోంది..!
పేదింట పుట్టిన సుసంపన్నుడా..
ఈసారి నిండు నూరేళ్ల ఆయువుతో..
ఇదే నేల మీద తప్పకుండా పుట్టు..
నీ రాక కోసం..
నిలువెల్లా కనులై.. వేచి చూస్తుంటాం!

కళ్లి తండా వరకూ అడుగడుగునా నివాళి

వెంట నడిచిన

మంత్రి సవిత, ప్రజా ప్రతినిధులు

నేడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

హాజరు కానున్న డిప్యూటీ సీఎం

పవన్ కల్యాణ్,

హోం మంత్రి అనిత, మంత్రులు

లోకేశ్, అనగాని, సత్యకుమార్

6



భక్తులతో కిక్కిరిసిన ఖాద్రీ ఆలయం



ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

కదిరి, మే 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీమత్ ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు కావడంతోపాటు భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి దర్శనానికి తరలివచ్చారు. మన రాష్ట్ర భక్తులతోపాటు కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో శుక్రవారం రాత్రి నుంచే చేరుకున్నారు. క్యూలైన్లలో గంటలకొద్దీ వేచి ఉండి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అధికారులు తీర్థప్రసాదాలతోపాటు, ఉచిత అన్నదానం నిర్వహించారు.

నేడునృసింహ జయంతి

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా ఆదివారం ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఇఓ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సాయంత్రం ఆరు గంటలకు స్వామి విశేష అలంకరణతో శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతుడుగా తిరుమాడవీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు.

రైతులకు మౌలిక వసతుల కల్పిస్తాం

- మంత్రి సత్యకుమార్‌యాదవ్
- గొట్లూరులో బహుళ ప్రయోజన గోదాము ప్రారంభం



గొట్లూరులో గోదాము వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరంరూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): రైతులకు మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని గొట్లూరు గ్రామంలో నాబార్డు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రూ.82 లక్షల నిధులతో.. వెయ్యి టన్నుల సామర్థ్యంతో కూడిన బహుళ ప్రయోజన గోదామును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉందని అన్నారు. గ్రామస్థాయిలో వ్యవసాయ దిగుబడుల నిల్వ, ఉత్పత్తుల ప్రాసెసింగ్ వంటి అవసరాల కోసం ఈ గోదాము ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, సొసైటీ సీఈఓ నారాయణస్వామి, అధికారులు, నాయకులు సందిరెడ్డి శ్రీనివాసులు, చంద్ర, లీలావతి, అనిల్, వెంకటేష్ పాల్గొన్నారు.

యుద్ధం గెలిచిరా..!

- కుమారుడిని దేశ రక్షణకు పంపిన తల్లిదండ్రులు
- సంతోషంగా సాగనంపిన గ్రామస్థులు
- సరిహద్దుకు పయనమైన కుర్లపల్లితండాకు చెందిన జవాన్ రేఖేనాయక్



తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న రేఖేనాయక్



కుర్లపల్లి తండాలో రేఖేనాయక్‌ను పూలమాలలతో బార్డర్‌కు పంపుతున్న గ్రామస్థులు

కనగానపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దేశ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాంబుల మోతలు, క్షిపణి దాడులు కొనసాగుతున్నాయి. ఏక్షణం ఎలా మారుతుందో ఎవరూ చెప్పలేని పరిస్థితి. దేశ రక్షణలో మన సైనికులు వీరోచితంగా పోరాడుతున్నారు. కొందరు వీరమరణం పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఏ తల్లిదండ్రులైనా తమ బిడ్డను సరిహద్దుకు యుద్ధానికి పంపడానికి అస్సలు ఒప్పుకోరు. అయితే కుర్లపల్లి తండాకు చెందిన భీమ్లానాయక్, భీమక్క దంపతులు మాత్రం వీరతిలకం దిద్ది తమ రెండో కుమారుడిని యుద్ధానికి పంపారు. ఈ సంఘటన మండలంలో కుర్లపల్లితండాలో శనివారం జరిగింది. కుర్లపల్లి తండాకు చెందిన భీమ్లానాయక్, భీమక్క దంపతుల రెండో కుమారుడు ఇంద్రావత్ రేఖేనాయక్. ఈయన పదేళ్ల కిందట ఎస్ఎస్‌బీ పోలీస్‌గా ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం బిహార్ వద్ద నేపాల్ సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతడికి భార్య ఉమాతో పాటు నవ్యశ్రీ అనే పాప ఉంది. 15 రోజుల కిందట సెలవుపై వచ్చిన జవాన్ రేఖేనాయక్‌కు విధుల్లో చేరాలని సమాచారం అందింది. ఈ విషయాన్ని కుటుంబీకులకు తెలపడంతో వారు రెప్పలమాటున కన్నీటిని అదిమిపట్టి, చిరునవ్వుతో దేశ రక్షణకు పంపారు. రేఖేనాయక్ తన తల్లితండ్రుల ఆశీర్వాదం తీసుకోని పయనమయ్యాడు. గ్రామ ప్రజలు, స్నేహితులు కేక్‌కట్ చేసి, పూలమాలలు వేసి బెంగళూరు ఎయిర్‌పోర్టు వరకూ సంతోషంగా జవాన్‌ను సాగనంపారు. జిల్లాలో ఓ జవాన్ అమరుడైన తరుణంలో మరో జవాన్‌ను బార్డర్‌కు పంపడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హెలీప్యాడ్ కేసులో 21 మంది వైసీపీ నాయకుల విచారణ



రామగిరి సీఐ ఎదుట విచారణకు హాజరైన ఆత్మకూరు మండల వైసీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం కుంటిమద్ది హెలీప్యాడ్ వద్ద ఆందోళన కేసులో 21 మంది వైసీపీ నాయకులను శనివారం పోలీసులు విచారించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో విచారణ అధికారి, రామగిరి సీఐ శ్రీధర్ ఘటనకు సంబంధించి ఒక్కొక్కరిని ప్రశ్నించారు. ఆత్మకూరు మండలానికి చెందిన 21 మందిని సీఐ వేర్వేరుగా విచారించారు. అందులో వైసీపీ ఆత్మకూరు మండల కన్వీనర్ జొన్నగిరి బాలపోతన్న, ఆత్మకూరు వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, మండల యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వడ్డిపల్లి, మదిగుబ్బ సర్పంచ్‌లు లక్ష్మీనారాయణరెడ్డి, తలారి నరసింహులు ఉన్నారు.

హెలీప్యాడ్ కేసులో 100 మందికిపైగా నిందితులుగా ఉన్న వైసీపీ నాయకులను విచారిస్తున్నారు. ఇప్పటి వరకు మొత్తం 62 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు విచారించారు. విచారణకు హాజరైన వారందరికి కేసు దర్యాప్తులో భాగంగా బీఎన్ఎస్ఎస్35(3) నోటీసులను జారీ చేశారు.

ఈఏపీసెట్‌తో ఉజ్వల భవిత

ఈ నెల 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు

21నుంచి 27 వరకు ఇంజనీరింగ్‌కు

ఉపాధ్యాయ ఖాళీలపై కసరత్తు

జిల్లా కేంద్రానికి 63 మంది ఎంఈఓలు

నేటి సాయంత్రాకి ఖాళీలపై స్పష్టత

(7లో...)

చెన్నకేశవా.. గోవిందా..!

కన్నుల పండువగా చెన్నకేశవస్వామి రథోత్సవం

జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు

మంత్రి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్, చిలకం మధు పూజలు



ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఆశీనులైన లక్ష్మీచెన్నకేశవస్వామి,శ్రీదేవి, భూదేవి



చెన్నకేశవుడిని దర్శించుకున్న పరిటాల శ్రీరామ్



మడుగుతేరుకు హాజరైన మంత్రిసత్యకుమార్

యుద్ధంలో విజయం కోసం పూజలు

ధర్మవరం, మే 10(ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణతో పట్టుకేంద్రం ప్రతిధ్వనించింది. లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన రథోత్సవం కన్నులపండువగా సాగింది. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం 7గంటలకు మడుగుతేరు, సాయంత్రం 4గంటలకు బ్రహ్మరథోత్సవం, 6గంటలకు ధూళోత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, ఆలయ అడహక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్, ఈఓ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మహేశ్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తదితరులు తేరు లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. అంతకుమునుపు ఆలయం నుంచి చెన్నకేశవస్వామి, భూదేవి, శ్రీదేవి ఉత్సవ విగ్రహాలను గజవాహనంపై తేరు వద్దకు తీసుకువచ్చి అందులో ఉంచారు. అనంతరం వేలాది మంది భక్తులు రథోత్సవం వద్ద పూజలు నిర్వహించి ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం 4గంటలకు బ్రహ్మరథోత్సవాన్ని ప్రారంభించారు.

దీంతో ఆప్రాంతమంతా గోవింద నామస్మరణలతో మార్మోగింది. ఈ బ్రహ్మోత్సవాన్ని తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ రథోత్సవం ముందు అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్లపుల్లయ్య శిష్యబృందం, కళాకారులు సింగానిమేళం, పంచమవాయిద్యం, బృంద నాట్యం నిర్వహించారు.

రథోత్సవంలో మంత్రి సత్యకుమార్‌యాదవ్, ధర్మవరం నియోజకవర్గటీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతంకాటమయ్య తదితరులు పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేకపూజలు చేయించారు. అనంతరం యుద్ధంలో భారత సైనికులకు స్వామివారి ఆశీస్సులు ఉండాలని మొక్కుకున్నారు. భారత్‌కు ఘన విజయం ప్రసాదించాలని చెన్నకేశవున్ని ప్రార్థించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, చేనేత ప్రముఖులు టీడీపీ నాయకులు సంధారాఘవ, ఫణికుమార్, చింతలపల్లి మహేశ్‌చౌదరి, నాగూర్ హుస్సేన్, భీమనేని ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అన్నా.. కాపాడండి..!

- బత్తలపల్లి వద్ద మహిళ ఆర్తనాదాలు
- రోడ్డు ప్రమాదంలో పల్టీలు కొట్టిన కారు
- ముగ్గురు మృతి.. ఏడుగురికి గాయాలు

7



సైనిక వాహనంలో సగర్వంగా.. సొంతూరుకు అమర వీరుడు..


బరువెక్కిన హృదయాలు..


తండోప తండాలుగా..

వీరుడా.. జోహార్..!



కళ్లితండాకు చేరిన మురళీ నాయక్ పార్థివ దేహం

- వీర జవానుకు అడుగడుగునా కన్నీటి నీరాజనం
- బెంగళూరు ఎయిర్ పోర్టు నుంచి స్వగ్రామం వరకూ...
- అగ్నివీర్ మురళీనాయక్ కుటుంబానికి పరామర్శల వెల్లువ
- ఆర్థిక సాయం అందజేసిన పలువురు
- నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరుకానున్న డిప్యూటీ సీఎం, మంత్రులు లోకేశ్, అనిత

పుట్టపర్తి/అనంతపురం నెట్‌వర్క్, మే 10(ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్‌లో పాకిస్థాన్ సైనికులతో పోరాడుతూ అమరుడైన అగ్నివీర్ జవాన్ మురళీనాయక్ పార్థివ దేహం అశేష జనవాహిని మధ్య బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని తన స్వగ్రామం కళ్లి తండాకు శనివారం రాత్రికి చేరుకుంది. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న మురళీ నాయక్, రాజౌరి సెక్టార్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో గురువారం అర్ధరాత్రి అసువులు బాసిన విషయం తెలిసిందే. కళ్లి తండాకి చెందిన శ్రీరామనాయక్, జ్యోతిబాయి దంపతుల ఏకైక కుమారుడు మురళీనాయక్. ఆయన పార్థివ దేహాన్ని శనివారం రాత్రి సైనికాధికారులు కళ్లి తండాకి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఢిల్లీ నుంచి మురళీనాయక్ పార్థివ దేహాన్ని బెంగళూరులోని దేవనహళ్లి విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు తీసుకువచ్చారు. ఎయిర్ పోర్టు వద్ద సైనిక అధికారులు సైనిక వందనం సమర్పించారు. అనంతరం పార్థివ దేహాన్ని ఆర్మీ వాహన కాన్వాయ్‌లో తీసుకుని కళ్లి తండాకు బయలుదేరారు.

మిన్నంటిన నినాదాలు

యుద్ధ భూమిలో వీరమరణం పొందిన వీర జవాన్ మురళీనాయక్ పార్థివ దేహాన్ని బెంగళూరు విమానాశ్రయం నుంచి స్వగ్రామానికి తీసుకువస్తున్న వేళ అన్ని ప్రాంతాల్లో అమర్ రహే నినాదాలు మిన్నంటాయి. జాతీయ రహదారి పొడవునా జనం పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు. జాతీయ జెండాలు చేతబూని, వాహనాలపై పూల వర్షం కురిపించారు.

అన్ని గ్రామాల కూడళ్లలో వాహనాలను ఆపి, మురళీ నాయక్ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర తదితరులు వీరజవాన్ పార్థివ దేహం కోసం బాగేపల్లి టోల్ గేట్ వద్ద ఎదురుచూశారు. వారు శనివారం మధ్యాహ్నమే అక్కడకు చేరుకొని వేచి ఉన్నారు. వారు మాట్లాడుతూ దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన వీరజవాన్ మురళీనాయక్ త్యాగం మరువలేనిదన్నారు. ఆయన చూపిన ధైర్య సాహసాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. మురళీనాయక్ పార్థివ దేహాన్ని చూసేందుకు ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఆ ప్రాంగణమంతా జైజవాన్, మురళీనాయక్ అమర రహే నినాదాలతో మార్మోగింది.

అందరినోటా కళ్లితండా మాట



నిన్నటి వరకు ఆ తండా పేరు గోరంట్ల మండలానికి మాత్రమే పరిచయం. కానీ వీరజవాన్ మురళీనాయక్ వల్ల ఆ తండా పేరు ప్రస్తుతం దేశవ్యాప్తంగా వినిపిస్తోంది. కళ్లితండాలో 70 నివాసాలు, 250 జనాభా ఉన్నారు. ఈ తండా నుంచి మురళీ నాయక్ అగ్నివీర్‌కి ఎంపికై దేశసరిహద్దులో గురువారం రాత్రి జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందారు. దీంతో ఆయన స్వగ్రామం కళ్లితండా గురించి వివిధ రాష్ట్రాల ప్రజలు గూగుల్ లో వెదుకుతూ తండాకి క్యూకట్టారు. రెండురోజులుగా ఆ తండాలో పోలీసులు బూటుచప్పుళ్లు, పోలీసు వాహనాల సైరన్‌లు మోగుతు న్నాయి. మురళీనాయక్ వలన తమ గ్రామానికి ఘనత వచ్చిందని తండా వాసులు గర్వపడుతున్నారు.


గుండె పగిలిన తండా జనం..

మహారాష్ట్రలో విగ్రహం ఏర్పాటు చేస్తాం



ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన మురళీనాయక్ విగ్రహాన్ని మహారాష్ట్రలో ఏర్పాటు చేస్తామని ఆరాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఉదయ్‌సంపత్ అన్నారు. ఆయన శనివారం ముంబాయి నుంచి బెంగళూరుకి చేరుకొని అక్కడ నుంచి రోడ్డు మార్గాన వీరజవాన్ మురళీనాయక్ స్వగ్రామమైన కళ్లితండాకి వచ్చారు. ఈ సందర్భంగా మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మురళీ నాయక్ తల్లిదండ్రులు శ్రీరామనాయక్, జ్యోతిబాయిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేతో వీడియోకాల్‌లో మాట్లాడించారు. జవాన్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి ఉదయ్ సంపత్ విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటి చిన్న తండాలో పుట్టిపెరిగిన వీరజవాన్ దేశం కోసం వీరమరణం పొందడం గర్వకారణమన్నారు. మురళీనాయక్ జన్మించింది మహారాష్ట్రలో కాబట్టి మా రాష్ట్రంలో విగ్రహం పెట్టడానికి ప్రయత్నిస్తామన్నారు.

ప్రతి మహిళ బొట్టులో సిందూరమై నిలిచారు: సింగర్ మంగ్లీబాయి



చిన్న వయసులోనే వీరమరణం పొందిన మురళీ నాయక్ దేశంలోని ప్రతి మహిళ బొట్టులోనే సిందూరమై నిలిచారని కొనియాడారు. కళ్లితండాకు శనివారం చేరుకున్న ఆమె జవాన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులు అర్పించారు.

పలువురి పరామర్శ.. ఆర్థిక సాయం


కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తరఫున చెక్కును మురళీనాయక్ కుటుంబ సభ్యులకు అందజేస్తున్న దృశ్యం

వీరజవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని శనివారం పలువురు పరామర్శించారు. కళ్లితండాలో వీరజవాన్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఒక నెల వేతనం రూ.1.75లక్షలు సాయంగా ప్రకటించడంతో ఆ మొత్తాన్ని ఆయన అనుచరులు ఆ కుటుంబ సభ్యులకు చెక్కు రూపంలో అందజేశారు. గోరంట్ల మండలానికి చెందిన టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, నానేనాయక్‌లు రూ. 30వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మురళీనాయక్ డిగ్రీ క్లాస్‌మేట్స్ కళ్లితండాకి చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- మురళీనాయక్ తల్లిదండ్రులను శనివారం నల్లచెరువు మండలానికి చెందిన పారిశ్రామిక వేత్త పాల్యం సుధాకర్ పరామర్శించారు. రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.


జోహార్లు..



అంత్యక్రియలకు భారీ ఏర్పాట్లు

వీరజవాన్ మురళీనాయక్ పార్థివ దేహం శనివారం రాత్రికి కళ్లితండాకి చేరుకుంది. ఆయన అంత్యక్రియలు ఆదివారం తండా సమీపంలో జరగనున్నాయి. ఆయన పార్థివ దేహాన్ని ప్రజలు చూడటానికి ఇంటి వద్ద ఏర్పాట్లు చేశారు. అంత్యక్రియలకు హాజరయ్యే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రముఖుల కోసం ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం కళ్లితండా వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు సుమారు 500 మందికి పైగా బందోబస్తులో ఉన్నట్లు పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. విద్యుత్ సౌకర్యంలో అంతరాయం కలగకుండ ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటుచేశారు. గోరంట్ల పుట్టపర్తి రహదారి నుంచి కళ్లితండాలోకి వచ్చేవరకు రోడ్డుకి ఇరువైపులా ముళ్లపొదలు తొలగించారు. పారిశుధ్య పనులు చేశారు. శ్మశాన వాటికకు వెళ్లే రహదారిని పూర్తి చేశారు.

నేడు ప్రముఖుల రాక

పాక్‌కాల్పుల్లో వీర మరణం పొందిన వీరజవాన్ మురళీనాయక్ అంత్యక్రియలకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, రాష్ట్ర మంత్రులు నారాలోకేశ్, వంగలపూడి అనిత హాజరుకానున్నట్లు జిల్లా ఎస్పీ శనివారం ఓప్రకటనలో పేర్కొన్నారు. వీర జవాన్ మురళీనాయక్ భౌతికకాయం కళ్లితండాకు శనివారం రాత్రికి చేరుకుంది. గుమ్మయ్యగారిపల్లి కూడలి నుంచి భారీర్యాలీగా గ్రామానికి చేరుకున్న అనంతరం అదివారం ఆయన అంత్యక్రియలు అధికారిక, సైనిక లాంఛనాలతో జరగనున్నట్లు తెలిపారు. దీంతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు.





వృథాకాదు నీ మరణం: ఎంఎస్ రాజు

దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరజవాన్ మురళీనాయక్ మరణం వృథాకాదు అని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు పేర్కొన్నారు. మడకశిరలోని విశ్రాంత భవనం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు శనివారం భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. భారీగా జనం హాజరవడంతో ఆ ప్రాంతమంతా జై జవాన్ నినాదాలతో మారుమోగింది. అనంతరం అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండియన్ ఆర్మీకి తన నెల జీతాన్ని విరాళంగా ప్రకటిస్తున్నానని తెలిపారు.


మురళీనాయక్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల

నేటి యువతకు ఆదర్శం: పరిటాల సునీత

నేటి తరం యువతకు వీరజవాన్ మురళీనాయక్ ఆదర్శంగా నిలిచారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. గోరంట్ల మండలం కళ్లితండాకు శనివారం ఆమె ధర్మవరం టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్‌తో కలిసి వెళ్లారు. వీరజవాన్ మురళీనాయక్ తల్లిదండ్రులను పరామర్శించి ఓదార్చారు. వీరజవాన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 25ఏళ్లకే తన ప్రాణాన్ని దేశానికి అంకితం చేసిన గొప్ప వీరుడు మురళీనాయక్ అని కొనియాడారు. ఆ కుటుంబానికి రూ.2లక్షలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.


మురళీనాయక్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే కందికుంట

దేశ సరిహద్దుల్లో వీరమరణం పొందిన వీర జవాన్ మురళీనాయక్ త్యాగం మనందరికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కదిరిలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సరిహద్దు కాల్పుల్లో అసువులు బాసిన వీర జవాన్‌కు అందరూ ఘనంగా నివాళులర్పించాలన్నారు. ఆకుటుంబానికి అండగా నిలవాలన్నారు. మురళీనాయక్ పార్థివదేహం స్వగ్రామానికి వస్తున్న నేపథ్యంలో కొడికొండ చెక్ పోస్టు వద్దకు వంద వాహనాలతో వెళ్లి సైనిక ర్యాలీకి సంఘీభావం ప్రకటించనున్నట్లు చెప్పారు.


జవాను పార్థివదేహం కోసం ఎదురు వెళ్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులు

చరిత్రలో నిలిచిపోతుంది: అమిలినేని

కళ్యాణదుర్గం, మే 10 (ఆంధ్రజ్యోతి): వీరజవాన్ మురళీనాయక్ మరణం చరిత్రపుటల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం మండల ంలోని తిమ్మసముద్రం వద్ద ఎంఎస్ఎంఈ పార్కు భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరజవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వీర జవాన్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తన నెల జీతం రూ.1.75 లక్షలు వీరజవాన్ కుటుంబానికి అందజేస్తున్నట్లు ప్రకటించారు.


మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

వివాహం వాయిదా.. యువతి ఆత్మహత్య

గార్లదిన్నె, మే 10(ఆంధ్రజ్యోతి): వివాహం వాయిదా పడడంతో మనస్థాపం చెంది ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఇల్లూరులో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు.. ఇల్లూరుకు చెందిన మస్తానయ్య, సుశీలమ్మ దంపతులు గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె లక్ష్మీనరసమ్మ (23) ఇంటర్ వరకు చదువుకుంది. ఏడేళ్ల క్రితం కుటుంబమంతా బెంగుళూరుకు వలస వెళ్లింది. లక్ష్మీనరసమ్మకు ఇటీవల పెళ్లి కుదిరింది. పది రోజుల క్రితం స్వగ్రామమైన ఇల్లూరుకు వచ్చారు. పెళ్లికి కావాల్సిన ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. నాలుగు రోజుల క్రితం యువతి లక్ష్మీనరసమ్మ అవ్వ మృతి చెందింది. దీంతో పెళ్లి వాయిదా వేశారు. రెండు సంవత్సరాలు క్రితం పెళ్లి నిశ్చయమై రద్దయింది. దీంతో రెండుసార్లు పెళ్లి వాయిదా పడిందని తరచూ బాధపడుతుండేది. తీవ్ర మనస్థాపానికి గురైన లక్ష్మీనరసమ్మ శుక్రవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రపోతున్న సమయంలో ఇంటి గవాక్షం కడ్డీలకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు చూడగా ఉరికి వేలాడుతూ కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో నుంచి పడి ఒకరి మృతి

బత్తలపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శివాలయం సమీపంలో ఆటోలో నుంచి జారి పడి సూర్యనారాయణ (50) శనివారం మృతి చెందినట్లు ఏఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ముదిగుబ్బ మండలం ఇందుకూరు గ్రామానికి చెందిన సూర్యనారాయణ, తిరుపాల్ కుటుంబ సభ్యులు ఆటోలో ధర్మవరం చెన్నకేశవస్వామి రథోత్సవానికి వెళ్లారు. అనంతరం గిద్దలూరులోని అక్కమ్మ జాతరకు బయల్దేరారు. బత్తలపల్లిలోని శివాలయం సమీపంలోకి రాగానే సూర్యనారాయణ ఆటోలో నుంచి కిందకు జారి పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో బాలుడి మృతి

ధర్మవరం, మే 10(ఆంధ్రజ్యోతి): స్విమ్మింగ్‌పూల్ మునిగి నందీశ్వరనాయుడు(9) మృతి చెందిన సంఘటన శనివారం పట్టణంలో జరిగింది. పాములాయి గ్రామానికి చెందిన సంజీవనాయుడు, శారద దంపతుల కుమారుడు నందీశ్వరనాయుడు ధర్మవరంలోని గీతానగర్‌లో ఉన్న తన చిన్నాన్న కృష్ణ ఇంటికి సెలవులకు వచ్చాడు. ఈ క్రమంలో పట్టణంలోని జీవానంద స్కూల్ సమీపంలో ఉన్న స్విమ్మింగ్ పూల్ వద్దకు చిన్నాన్నతో వెళ్లాడు. అక్కడ చిన్న స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టాడు. కొద్దిసేపటి తర్వాత చిన్నాన్నకు తెలియకుండా పెద్ద స్విమ్మింగ్‌పూల్‌లోకి దూకాడు. ఈత రాకపోవడంతో అందులో మునిగిపోయాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన కృష్ణ బాలుడి కోసం వెదికాడు. పెద్ద స్విమ్మింగ్ పూల్‌లో అచేతనంగా ఉన్న బాలుడిని గమనించి, బయటికి తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆర్డీటీకి అండగా ఉంటాం

రాజకీయాలకు అతీతంగా సంస్థ సేవలు స్ఫూర్తిదాయకం

మంత్రులు పయ్యావుల, సత్యకుమార్ యాదవ్

మాంచో ఫెర్రర్‌తో భేటీ



మాంచోఫెర్రర్‌తో మాట్లాడుతున్న మంత్రులు పయ్యావుల, సత్యకుమార్

అనంతపురం, మే 10(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆర్డీటీకి అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మంత్రులు ఇద్దరూ ఆర్డీటీ డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనేక అంశాలపై చర్చించారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో ఆర్డీటీ కొన్ని దశాబ్దాలుగా అందిస్తున్న సేవలను గుర్తు చేసుకున్నారు. కరువు, పేదరిక ప్రభావిత ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, మహిళా సాధికారత, ఇళ్ల నిర్మాణం తదితర అనేక సేవలను ఆర్డీటీ చేస్తోందని ప్రశంసించారు. రాజకీయాలకు అతీతంగా సేవలు కొనసాగుతుండటం స్ఫూర్తిదాయకమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణపై చర్చించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు లేఖ రాసిన విషయాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ గుర్తు చేశారు. ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ కోసం సంస్థకు అనుకూలంగా విజ్ఞప్తి చేసిన విషయాన్ని మంత్రి సత్యకుమార్ మాంచోకు వివరించారు. ఆర్డీటీని ప్రేయర్ అప్రూవల్ కేటగిరి నుంచి తొలగించాల్సిన అవసరాన్ని లేఖలో పేర్కొన్నట్లు చెప్పుకొచ్చారు. ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతుల కోసం అవసరమైన అన్ని పత్రాలను కేంద్ర ప్రభుత్వానికి పంపాలని మాంచోకు మంత్రులు సూచించారు. ప్రజా సంక్షేమానికి ఉపయోగపడే పనులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వారు స్పష్టం చేశారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య



రాముడు (ఫైల్)



ఎర్రిస్వామి (ఫైల్)

విడపనకల్లు/ఉరవకొండ, మే 10(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. విడపనకల్లు మండలం పెద్ద కొట్టాలపల్లికి చెందిన బోగాల రాముడు (44), ఉరవకొండ మండలం ఆమిద్యాలలో ఎర్రిస్వామి(58) బలవన్మరణానికి పాల్పడ్డారు. బోగాల రాముడుకు రెండు ఎకరాల పొలం ఉంది. దీనికి తోడు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకుని కంది, పప్పుశనగ సాగు చేసేవాడు. ఆరేళ్లుగా దిగుబడి సరిగా రాక తీవ్రంగా నష్టపోయాడు. కౌలు సేద్యం వద్దని, అప్పుల పాలవుతామని భార్య రాజమ్మ ఎన్నిసార్లు చెప్పినా వినకుండా ముందుకు పోయాడు. వడ్డీలకు తెచ్చిన అప్పులు రూ.5 లక్షలు దాటాయి. వాటిని తీర్చేమార్గంలేక శనివారం ఉదయం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఎర్రిస్వామికి రెండున్నర ఎకరాల పొలం ఉంది. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేసేవాడు. హంద్రీకాలువ నుంచి పొలం వరకూ కిలో మీటరు పైప్‌లైన్ వేసుకున్నాడు. పొలంలో రెండు బోర్లు కూడా వేయించా డు. కానీ సేద్యం కలిసిరాలేదు. దీనికితోడు ఆయన భార్య వైద్యం కోసం రూ.9 లక్షల దాకా అప్పులు చేశాడు. అప్పులు తీర్చేమార్గం లేక శుక్రవారం సాయంత్రం పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. అటుగా వెళ్లినవారు శనివారం ఉదయం గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రైతు ఆత్మహత్యలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈఏపీసెట్‌తో ఉజ్వల భవిత

ఈ నెల 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు

21నుంచి 27 వరకు ఇంజనీరింగ్‌కు

పుట్టపర్తిరూరల్/కొత్తచెరువు, మే 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఏపీ ఈఏపీ సెట్ తొలిమెట్టు అని విద్యారంగ నిపుణులు పేర్కొంటున్నారు. సీనియర్ ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కోర్సులలో ప్రవేశానికి రాష్ట్రప్రభుత్వం ఇది వరకే ఏపీ ఈఏపీసెట్ నోటిఫికేషన్ ప్రకటించింది. ఈక్రమంలోనే దరఖాస్తులను స్వీకరించింది. ఈ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు తమ ర్యాంకుల ఆధారంగా ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు రాష్ట్రంలో ఎక్కడైనా ఇంజనీరింగ్ ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశం పొందవచ్చు. ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలు రాసిన ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు సీఈటీఎస్.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి, ఏపీఈఏపీ సెట్- 2025 ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో అర్హతలు, దరఖాస్తు ప్రక్రియతో పాటు కోర్సుల వివరాలు, ముఖ్యమైన తేదీలు, నిబంధనలు తదితర పూర్తి వివరాలు ఉంటాయి.

ఈ పత్రాలు తప్పనిసరి

ఏపీఈఏపీ సెట్‌కు దరఖాస్తు చేసే సమయంలో వివిధ కేటగిరిలోకి వచ్చే విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలను తప్పనిసరిగా సిద్ధం చేసుకోవాలి. ఓసీ, బీసీ, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులు కేటగిరి వారీగా తమ సామాజిక వర్గం ఎంపిక చేసుకుని ఆన్‌లైన్ అప్లికేషన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. సంబంధిత ధ్రువపత్రాలకు నెంబరును నమోదుచేయాల్సి ఉంటుంది. ఈడబ్ల్యూఎస్, ఆదాయ ధ్రువపత్రాల నెంబర్లను సైతం నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1 తర్వాత తీసుకున్న ధ్రువపత్రాలు పరిగణనలోకి వస్తాయి. విద్యార్థుల స్థానికత నిర్ధారణకు ఆరోతరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఏ విద్యా సంస్థలలో ఏఊర్లో చదివారనే వివరాలను ఆయా విద్యాసంవత్సరాల వారీగా నమోదు చేయాల్సి ఉంటుంది. తర్వాత ఏపీఈఏపీసెట్ పరీక్ష ఏ జిల్లాలో రాస్తారనే సమాచారం పొందుపరచాల్సి ఉంటుంది.

సమీపిస్తున్న గడువు

ఈనెల 19, 20 తేదీల్లో ఏపీ ఈఏపీసెట్ పరీక్షలు జరగనున్నాయి. ఇందులో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు ప్రభుత్వం నిర్వహించనుంది. 21నుంచి 27 వరకు ఇంజనీరింగ్ ఎంట్రన్స్‌కు సంబంధించి ప్రవేశపరీక్షలు జరుగనున్నాయి. ఈ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధిస్తే పేరెన్నికగన్న కళాశాలల్లో సీట్లు వస్తాయి. కోర్సు పూర్తికాగానే క్యాంపస్ ప్లేస్‌మెంట్ వచ్చే అవకాశం ఉంటుంది.

అన్నా..! నా భర్త, కొడుకుని కాపాడండి

బత్తలపల్లి వద్ద మహిళ ఆర్తనాదాలు

రోడ్డు ప్రమాదంలో పల్టీలు కొట్టిన కారు

ముగ్గురు మృతి.. ఏడుగురికి గాయాలు

తిరుమల దైవ దర్శనానికి వెళ్తుండగా ఘటన



మృతి చెందిన రాజశేఖర్‌రెడ్డి





పల్టీలు కొట్టిన కారు, మృతి చెందిన యశ్విత్

బత్తలపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): అన్నా..! నా భర్తను కాపాడండి. అయ్యా..! నా కొడుకును బతికించండి. ఎవరైనా కాపాడండి స్వామి అంటూ ఆ మహిళ చేసిన ఆర్తనాదాలు పలువురిని కంటతడి పెట్టించా యి. బత్తలపల్లిలోని అనంతపురం రోడ్డు బైపాస్ వై జంక్షన్‌లో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందులో ముగ్గురు మృతి చెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాదుర్గం పట్టణానికి చెందిన గాజుల రామ్మోహన్, రాజశేఖర్‌రెడ్డి కుటుంబాలు శనివారం ఉదయం తిరుమల దైవ దర్శనానికి కారులో బయల్దేరాయి. సొంత వాహనం కావడంతో రామ్మోహన్ డ్రైవింగ్ చేస్తున్నాడు. అయితే కారు బత్తలపల్లి సమీపములోని వై జంక్షన్ వద్దకు రాగానే అదుపు తప్పి పల్టీలు కొట్టింది. కారు డోర్లు తెరుచుకోవడంతో అందులో ఉన్న వారంతా చెల్లాచెదురుగా పడిపోయారు. తారు రోడ్డుపైన పడటంతో రాజశేఖర్‌రెడ్డి(40), ఆయన కుమారుడు యశ్విత్(8)లు మృతి చెందారు. రాజశేఖర్‌రెడ్డి భార్య దీపిక, కుమార్తె ఆరాధ్య, గాజుల రామ్మోహన్, అతడి భార్య మాధవి, కుమారుడు కౌశల్ కుమార్, కుమార్తెలు జశ్విక, శాన్విక, వారి మిత్రుడు గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన ప్రశాంత్ (30) తీవ్రంగా గాయపడ్డారు. నెత్తుటి మడుగులో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న భర్త, కుమారుడిని కాపాడమని రాజశేఖర్‌రెడ్డి భార్య దీపిక ఆర్తనాదాలు చేయడం అక్కడున్న వారిని కలచివేసింది. దీపిక సత్యసాయి వాటర్ వర్క్స్ కుందుర్పి మండలంలో జూనియర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. వీరిది బ్రహ్మసముద్రం మండలంలోని పొబ్బర్లపల్లి స్వగ్రామం కాగా కళ్యాణదుర్గంలో నివాసం ఉంటున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఏఎస్ఐ సోమశేఖర్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రులను పోలీస్ జీపుతో పాటు 108 వాహనంలో స్థానిక ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ప్రశాంత్ పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాలను ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించడానికి హైవే అంబులెన్సు సకాలంలో స్పందించలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ నిధులపై సీఎం హామీ

13న విజయవాడలో అఖిలపక్ష భేటీ

అవసరమైతే ఢిల్లీకి వెళ్తాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురం విద్య, మే 10(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ ద్వారా నిధుల పునరుద్ధరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్, ఇతర నేతలతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... ఆర్డీటీ విషయంపై ఇటీవలే ముఖ్యమంత్రిని కలిశామని, సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ నిధుల పునరుద్ధరణ అయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఈనెల 13న అన్ని రాజకీయ పార్టీలతో సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆర్డీటీ, సత్యసాయి ట్రస్టులు ఈ ప్రాంత ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు సమకూర్చాయన్నారు. అవసరమైతే ఆర్డీటీ కోసం తాము ఢిల్లీ వరకూ వెళ్తామని తెలిపారు.

టెర్రరిజాన్ని కట్టడి చేయాలి..

ప్రపంచ దేశాలన్నీ ఉగ్రవాదాన్ని అంతమొందించాల్సిన అవసరం ఉందని రామకృష్ణ అన్నారు. మొదటి నుంచీ పాకిస్థాన్ టెర్రరిస్టు క్యాంపులను పోషించిందని, దాని పర్యవసానంగానే పెహల్గాంలో మన పౌరులను పొట్టనబెట్టుకున్నారని మండిపడ్డారు. అందుకే మన ప్రభుత్వం టెర్రరిస్టు క్యాంపులపై దాడి చేసిందని అన్నారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మతాలు, వర్గాలకు అతీతంగా ప్రజలు హర్షం వ్యక్తం చేశారని గుర్తుచేశారు. టెర్రరిజాన్ని నిర్మూలించకపోతే నాగరిక సమాజం జీవించే అవకాశం ఉండదని అన్నారు. కొన్ని మీడియా సంస్థలు. ఈ ఘటనకు మతం రంగు పూయడం సరికాదని అన్నారు. మీడియా సంస్థలు, వార్తా పత్రికలు సంయమనం పాటించాలని కోరారు. సీఎం చంద్రబాబు హంద్రీనీవాకు రూ.3 వేల కోట్లకు పైగా నిధులు ఇవ్వడం సంతోషదాయకమని అన్నారు. రాయలసీమ సీమ, ఉత్తరాంధ్ర రైతులు కోరుకునే పనులు చేయాలని కోరారు. కడపలో ఒక రిజర్వాయర్ కింద కూడా కాలువలు తవ్వలేదని, గండికోట, సర్వరాయసాగర్, బ్రహ్మంగారి మఠం రిజర్వాయర్లలో నీళ్లు ఉన్నా కాలువలు లేని కారణంగా రైతులు పంటలు పండించుకోలేని దుస్థితి ఉందని అన్నారు. సీఎం చంద్రబాబు తన ఆలోచనలు, ప్రయారిటీలు మార్చుకుని, మెగా ప్రాజెక్టులు కాకుండా రైతులకు అవసరమైన పనులు చేయాలని సూచించారు. జగదీష్ మాట్లాడుతూ... హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని సీఎం, మంత్రులు హామీ ఇచ్చారన్నారు. ఇది జరగాలంటే... 40 టీఎంసీలు వదలాలని తెలిపారు. హెచ్ఎన్ఎస్ఎస్ రెండో విడత పనుల్లో కాంక్రీట్ పనులు పూర్తి చేసిన తర్వాత ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలంటే.. కాలువలు తవ్వకుండా ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కార్యక్రమంలో అనంతపురం, సత్యసాయి జిల్లాల కార్యదర్శులు జాఫర్, వేమయ్య, నాయకులు నారాయణస్వామి, మల్లికార్జున, రాజారెడ్డి, కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలపై కసరత్తు

జిల్లా కేంద్రానికి 63 మంది ఎంఈఓలు

నేటి సాయంత్రానికి ఖాళీలపై స్పష్టత



సమావేశమైన రెండు జిల్లాల డీఈఓలు ప్రసాద్‌బాబు, కిష్టప్ప

అనంతపురం విద్య, మే 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల నేపథ్యంలో ఖాళీలు లెక్క తేల్చే పని మొదలైంది. అనంతపురం, సత్యసాయి జిల్లాల డీఈఓలు ప్రసాద్ బాబు, కిష్టప్ప ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ మొదలు పెట్టారు. నగరంలోని శారదామున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో శనివారం ఈ కసరత్తు ప్రారంభించారు. 63 మండలాల నుంచి ఎంఈఓలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను పిలిపించి ఖాళీల వివరాలను ఆరా తీశారు. ముఖ్యంగా ఐదేళ్లు, ఎనిమిదేళ్లు, క్లియర్ వేకెన్సీలు, రీ అపోర్షన్, ఫారిన్ సర్వీస్, స్టడీ లీవ్, అనధికార అబ్సెంట్.. ఇలా అన్ని ఖాళీల లెక్కలు తీయాలని రెండు జిల్లాల డీఈఓలు ఎంఈఓలను ఆదేశించారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇదే కసరత్తు చేశారు. ఆదివారం సాయంత్రానికి ఖాళీలపై పూర్తిస్థాయిలో స్పష్టత వస్తుందని డీఈఓలు పేర్కొన్నారు. బదిలీలు, పదోన్నతుల నేపథ్యంలో కమిటీలు నియమించారు. రెండు జిల్లాల డిప్యూటీ డీఈఓలు, సూపరింటెండెంట్లు ఐటీ సెల్, జిల్లా విద్యాశాఖ సిబ్బందితో కలసి బదిలీలు, ప్రమోషన్లు, ఖాళీలు, టెక్నికల్ టీమ్స్ ఏర్పాటు చేశారు.

ప్రత్యేక కౌంటర్లు

ఖాళీల లెక్కింపుతోపాటు, బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా గదుల్లో కౌంటర్లు ఏర్పాటు చేశారు. పుట్టపర్తి- పెనుకొండ డివిజన్లు ఒక గదిలో, కదిరి- ధర్మవరం డివిజన్లు ఒక గదిలో, కళ్యాణదుర్గం-గుంతకల్లు డివిజన్లు ఒక గదిలో, అనంతపురం డివిజన్ మరో గదిలో కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్ల కోసం, స్కూల్ అసిస్టెంట్ల నుంచి ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్ల కోసం మరో రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. త్వరలో జరిగే బదిలీలు, ప్రమోషన్లు, ఇతర గ్రీవెన్సుల కోసం టీచర్లు ఆయా కౌంటర్లలో సంప్రదించేలా ఏర్పాట్లు చేశారు.

జేసీ ఇంటికి రోడ్లు, భవనాలశాఖ మంత్రి



మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, మే 10(ఆంధ్రజ్యోతి): రోడ్ల భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆహ్వానం మేరకు వారి నివాసానికి వచ్చారు. మంత్రి తాడిపత్రిలో బంధువుల వివాహానికి హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు మంత్రి జనార్దన్‌రెడ్డి, ఆయన భార్య ఇందిర వారి ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చేసిన పనులకు సంబంధించి సుమారు రూ.8కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పుట్లూరు నుంచి ఇగుడూరు వరకు రహదారి రూ.33 కోట్లతో గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరైందని.. వైసీపీ హయాంలో రద్దయిందని తెలిపారు. మళ్లీ వచ్చేవిధంగా చూడాలని కోరారు. ఇంకా వివిధ అభివృద్ధి పనుల గురించి చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ధర్మవరం, మే 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్టు వాల్మీకి ఉద్యోగసంఘం నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహులు, వాల్మీకి రాంప్రసాద్‌లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రతిభా పురస్కారాలను పెనుకొండ మిట్ట ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 25న అందజేస్తామన్నారు. పదో తరగతిలో 450 మార్కులు, ప్రైవేటు పాఠశాలలో 500 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థులు, ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలలో 750 మార్కులు, ప్రైవేటు కళాశాలలో 850 మార్కులకుపైగా వచ్చిన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామ న్నారు. వివరాలకు 9177620400, 9394798674, 99666926161 నెంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం క్లాక్‌టవర్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉపకారవేతనాల కోసం పేద బ్రాహ్మణ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని బ్రాహ్మణ విద్యార్థినీ మహిళా సంక్షేమసంఘం కార్యదర్శి రమాదేవి తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరం ఆరోతరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న ప్రతిభగల పేద బ్రాహ్మణ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9703789201, 9490130999లను సంప్రదించాలని కోరారు.

చీనీ టన్ను రూ. 22వేలు

అనంతపురం రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 22,800 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3,900, సరాసరి రూ. 13,500తో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 227 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

చంద్రబాబు మాటలన్నీ అసత్యాలే: ఎమ్మెల్సీ

ఉరవకొండ, మే 10(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వెడల్పు పనుల పరిశీలనకు వచ్చిన సీఎం చంద్రబాబు ఛాయాపురం ప్రజావేదికలో అసత్యాలు మాట్లాడారని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. రైతులకు ఎకరాకు రూ.60వేల కౌలు వస్తుందని చెప్పడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఎకరాకు రూ.60వేలు కౌలు ఇస్తామంటే రైతులను ఒప్పించి, కావాల్సినంత భూమి ఇప్పిస్తాం. తీసుకోవడానికి మీరు సిద్ధమా అని సవాల్ విసిరారు. వైఎస్సార్ సీఎం అయ్యాక 40 టీఎంసీ సామర్థ్యంతో హంద్రీనీవా పనులు జరిగాయన్నారు. వైసీపీ పాలనలో హంద్రీనీవా సామర్థ్యాన్ని 6,300క్యూసెక్కులకు పెంచుతూ టెండర్లు కూడా పిలిచామన్నారు. రెండోఫేజ్‌లో లైనింగ్ చేస్తే రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. మొదటి దశలో 3800 క్యూసెక్కులు కాకుండా, 10వేల క్యూసెక్కులు నీరు తెచ్చేలా పనులు చేయాలన్నారు.

చరిత్రను వక్రీకరించొద్దు: అనంత

అనంతపురం క్రైం,మే10(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా విషయంలో చరిత్రను వక్రీకరించొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు పాలనలో హంద్రీనీవాను శంకుస్థాపనలకే పరిమితం చేశారని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం అయ్యాకే పనులు పరుగు పెట్టాయన్నారు. దాని ఫలితంగానే 2012 నుంచి జిల్లాకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు వస్తున్నాయని తెలిపారు. ఛాయాపురం పర్యటనలో చంద్రబాబు మాట్లాడిన తీరు చూస్తే ఆయనలో ఏమీ మార్పు రాలేదని అర్థమవుతోందన్నారు. కృష్ణా జలాల కోసం ఇక్కడ దశాబ్దాలుగా పెద్ద ఎత్తున పోరాటాలు జరిగాయని, దాని ఫలితమే హంద్రీనీవా ప్రాజెక్టు అన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో మిర్చి సాగు అధికమని, కానీ ధర లేదన్నారు. కందులు, శనగ, పత్తి పంటలకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. కరువు పరిస్థితులపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరం అన్నారు. యుద్ధభూమిలో వీరమరణం పొందిన గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన మురళినాయక్‌కు జోహార్లు అర్పించారు. ఆయన చూపిన ధైర్యసాహసాలు దేశానికి గర్వకారణం అన్నారు.

చిరుతల సంచారంతో జనం బెంబేలు



కరిడికొండ గ్రామ శివారులో చిరుతలు సంచారం

గుత్తిరూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిడికొండ గ్రామ శివారులోని కొండలో శనివారం తెల్లవారుజామున చిరుతల సంచారంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. తెల్లవారుజామున క్రషర్ మిషన్ వద్ద టిప్పర్‌ను తీసుకొని వెళ్తుండగా.. దారిలో నాలుగు చిరుతల రావడంతో డ్రైవర్ కేకలు వేయగా కొండలోకి వెళ్లాయి. జన సంచారంలోకి చిరుతలు రావడంతో ప్రజలు భయాందోళన గురయ్యారు. చిరుతల సంచారం గురించి స్థానిక ప్రజలు అటవీశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్ బాక్స్

నందివాహనంపై ఊరేగిన సంగమేశ్వరుడు



గ్రామంలో స్వామివారి ఊరేగింపు

కొత్తచెరువు, మే 10(ఆంధ్రజ్యోతి): సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శనివారం సాయంత్రం సంఘమేశ్వరుడిని నందివాహనంపై గ్రామ పురవీధులలో ఊరేగించారు. భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఎడ్లబండిపై నంది వాహనాన్ని పుష్పాలతో అలంకరించి పార్వతీపరమేశ్వరుడి ఉత్సవ విగ్రహాలను ఉంచి మంగళవాయుద్యాల నడుమ ఊరేగించారు. ఆలయ ధర్మకర్తలు మనోహర్, నటరాజ్, ఫణి, నాగరాజ్, అర్చకుడు సాయి పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

వైభవంగా యల్లమ్మ తిరునాళ్ల



ప్రత్యేక వాహనంలో అమ్మవారు

నంబులపూలకుంట, మే 10 (ఆంధ్ర జ్యోతి): మండలకేంద్రంలో యల్లమ్మ తిరునాళ్ల శనివారం ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి ఒడిబియ్యంతో చీర, సారె సమర్పించారు. గ్రామ పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగించారు. ప్రతి ఇంటినుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎన్పీకుంట, ఎన్.రెడ్డివారిపల్లి, దిగువపల్లి, ఇందిరాకాలనీ, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లో ఊరేగింపు సాగింది.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి



అలంకరణలో స్వామివారు

ధర్మవరం రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లి గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పూజారి నాగానందస్వామి స్వామివారి మూలవిరాట్‌ను ఆకుపూజ, ప్రత్యేకపూలతో అలంకరించారు. పెద్దఎత్తున గ్రామస్థులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

మహాసంప్రోక్షణ యజ్ఞం ప్రారంభం



అలంకరణలో అమ్మవారు

తాడిమర్రి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి కుంబాభిషేక మహాసంప్రోక్షణ యజ్ఞం శనివారం సాయంత్రం ప్రారంభమైంది. సాయంత్రం 5-30గంటలకు గణపతి పూజ, రక్షాబంధనం, మత్స్యం జయ గ్రహణం, అంకురార్పణ హోమం నిర్వహించి లగు పూర్ణాహుతి చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం వరకు జరిగే ఈ యజ్ఞంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆలయకమిటీ అధ్యక్షుడు పాటిల్‌ప్రకాశ్‌రెడ్డి కోరారు. ప్రతి రోజు నిర్వహించే యజ్ఞ కార్యక్రమాలలో టీటీడీ ఆగమ పండితుడు పరాంకుశం అనంతగోపాలకృష్ణమాచార్యులు, వారి బృందం పాల్గొంటారని ఆయన తెలిపారు.

తొలి గురువు అమ్మే

తనకల్లు, మే 10(ఆంధ్రజ్యోతి): తొలి గురువు అమ్మేనని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ అన్నారు. మండలంలోని మల్లిరెడ్డిపల్లి, మొగిలిచెట్ల తండా అంగన్‌వాడీకేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. చిన్నారులు తల్లులకు పూవ్వులు ఇచ్చి వందనం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..!



కూలేందుకు సిద్ధంగా ఉన్న స్తంభం

కొత్తచెరువు, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరగంపల్లి గ్రామంలో ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభం అడుగు భాగాన పెచ్చులూడి కూలడానికి సిద్ధంగా ఉంది. దీంతో గ్రామస్థులు విద్యుత్ స్తంభానికి కట్టిని సోపుర్టుగా ఉంచారు. అది తీసేస్తే ఆ స్తంభం ఏ సమయంలో కూలుతుందోనన్న భయాందోళనలు గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. అసలే గాలివానతో కూడిన వర్షాలు పడుతున్నాయి. గాలి ఎక్కువగా వీస్తే విద్యుత్ స్తంభంతో పాటు డీపీ కూడా కిందపడే అవకాశం ఉందని గ్రామస్థులు భయపడుతున్నారు. విద్యుత్ స్తంబాన్ని మార్చాలని పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ప్రమాదం జరిగితే తప్ప పట్టించుకోరా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

ఇసుక దిమ్మెలుపడి వృద్ధుడి మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

ఓబుళదేవరచెరువు, మే10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువపల్లి గ్రామానికి చెందిన జెరిపిటి లక్ష్మీనారాయణ (65) అనే వృద్ధుడు శనివారం ఇసుక దిమ్మెలు విరిగిపడి మృతిచెందాడు. బంధువులు తెలిపిన మేరకు వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఇసుక కోసం లక్ష్మీనారాయణ, ఇదే గ్రామానికి చెందిన సిద్దూ గ్రామ సమీపంలోని కుమ్మర వంకలో ఇసుక తోడుతుండగా, ఇసుక దిమ్మెలు లక్ష్మీనారాయణపై పడ్డాయి. గమనించిన సిద్దూ విషయాన్ని బంధువులు, గ్రామస్థులకు చేరవేశారు. వెంటనే వచ్చిన వారు దిమ్మెలను తొలగించి అతనిని వెలికి తీసి, చికిత్స నిమిత్తం కదిరికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. లక్ష్మీనారాయణకు భార్య ఈశ్వరమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఈ నీరు సురక్షితమేనా..?

- అపరిశుభ్రంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు
- క్లోరినేషన్ ఊసెత్తని అధికారులు
- కలుషిత నీరే గతి
- అటకెక్కిన నీటి పరీక్షలు



వరిగిరెడ్డిపల్లి తండాలో కంపచెట్ల మధ్య నీటి ట్యాంక్

కదిరిఅర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): కలుషిత తాగునీటితోనే 80 శాతం రోగాలు ప్రబలతాయని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా వేసవిలో దాహార్తిని తీర్చుకోవడానికి దొరికిన నీటిని తాగి అనేకమంది డయేరియా, ఇతర రోగాలబారిన పడుతుంటారు.ప్రజలకు రక్షిత తాగునీటిని అందించే ఉద్దేశంతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌లు శుభ్రం చేయకపోవడం వల్ల పాచిపట్టిన నీటిని తాగాలంటే ప్రజలు భయపడుతున్నారు.

పర్యవేక్షణ ఏదీ?



పట్నం గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న నీటి ట్యాంక్

తాగునీటిని సరఫరా చేసే ట్యాంక్‌లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో రంగుమారిన నీరు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రతి 15రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రంచేసి క్లోరినేషన్ చేయాల్సి ఉంది. అలాంటిది ఇక్కడ ఏమీ జరగడంలేదు. ఉన్నతాధికారులు వస్తున్నారని సమాచారం వచ్చినప్పుడు మాత్రమే తూతూమంత్రంగా శుభ్రంచేసి చేతులు దులుపుకుంటున్నారు. పర్యవే క్షించాల్సిన అధికారులు సంబంధం లేన్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

శుభ్రం చేసే తేదీల ఊసే లేదు

పంచాయతీల పరిధిలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు నీటిని నింపే ముందు బ్లీచింగ్ పౌడర్‌తో క్లోరినేషన్ చేయాల్సి ఉంది. 15రోజలకు ఒకసారి తప్పకుండా శుభ్రం చేసి, ఆ తేదీని బోర్డులో నమోదు చేయాల్సి ఉంది అనంతరం శుభ్రం చేసే తేదీని కూడా నమోదు చేయాల్సి ఉంది. ట్యాంక్‌ల చుట్టూ అపరిశుభ్రత లేకుండా చర్యలు చేపట్టాలి. కొన్ని పంచాయతీల్లో మినహా నెలల తరబడి శుభ్రం చేయడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో పైపులైన్ దెబ్బతిన్నా మరమ్మతులు చేపట్టడం లేదనే ఆరోపణలున్నాయి. నీటి నాణ్యత పరీక్షించేందుకు ప్రతి సచివాలయానికి జలజీవన్ మిషన్ కింద ఫీల్డు టెస్టికింగ్ కిట్లు అందించారు. నీటి నమూనాలను సేకరించి, పరీక్షించేలా ఇంజనీరింగ్ వైద్య ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వీరు పరీక్షలు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఇది నామమాత్రంగానే జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. నీటి పరీక్షలు సక్రమంగా జరిగితే ఫ్లోరైడ్, క్లోరైడ్, నీటి గాఢత, సాంద్రత, లవణాలు ఏమేరకున్నాయో తెలుస్తుంది. ఫలితాలనుబట్టి నీటి నాణ్యతను పెంచేలా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పలు సూచనలు చేయవచ్చు.

మండల పరిస్థితి ఇది

గ్రామాల్లో ట్యాంక్‌ల నిర్వాహణ పంచాయతీల బాధ్యత. నిబంధనల మేరకు ట్యాంక్‌లు శుభ్రం చేసి, శుద్ధనీటిని ప్రజలకు అందించాలి. ట్యాంక్‌లు శుభ్రంచేయడం, కొళాయిల వద్ద బ్లీచింగ్ చల్లడం, నీటిని క్లోరినేషన్ చేయడానికి పంచాయతీ నుంచి నిధులు ఖర్చు పెడతారు. అవి రికార్డుల పరంగా ఉంటున్నాయే తప్ప, క్షేత్రస్థాయిలో పారిశుధ్యం మెరుగుపడడంలేదు. మండల పరిధిలో ఓవర్ హెడ్ ట్యాంక్‌లు 20, గ్రౌండ్ లెవల్ సర్వీస్ ట్యాంక్‌లు 17 ద్వారా నీటి సరఫరా అవుతోంది. క్లోరినేషన్ నిమిత్తం పంచాయతీకి ఆర్థిక సంఘం నిధులనుంచి ఏటా పదిశాతం నిధులు ప్రభుత్వం కేటాయిస్తుంది. అయితే ఆ నిధులు సక్రమంగా వినియోగించడంలేదు. ఇప్పటికైనా నిబంధనల మేరకు ట్యాంక్‌లను శుభ్రం చేసి, రక్షిత మంచినీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

శుభ్రం చేసి చాలారోజులైంది
- నాగేంద్ర, పట్నం

గ్రామంలో రోజూ కలుషిత నీరే వస్తోంది. ట్యాంక్‌లు శుభ్రం చేసి చాలరోజులైంది. ట్యాంక్ చుట్టూ పిచ్చిమొక్కలు, గడ్డి, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. పైపులు లీకేజీ అవుతునాయిఇ. అధికారులు ట్యాంక్‌లను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలి.

కఠిన చర్యలు తీసుకుంటాం
- ఆంజనప్ప, డీఎల్‌పీఓ, కదిరి:

పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి చర్యలు చేపడతాం. ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసి తేదీలు నమోదు చేయలని కార్యదర్శులకు సూచిస్తున్నాం. తాగునీటి విషయంలో నిర్లక్ష్యం వహించే కార్యదర్శులపై కఠినచర్యలు తీసుకుంటాం. పారిశుధ్య పనులు ఎప్పటికపుడు యాప్‌ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంది.

పర్యవేక్షణ పెంచుతాం,
- వెంకటేశ్వర్లు, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కదిరి



నీటిట్యాంక్‌లను శుభ్రం చేయాల్సిన బాధ్యత పంచాయతీలేదే. క్రమం తప్పకుండా జరిగేలా పర్యవేక్షణ పెంచుతాం. నీటి ట్యాంక్‌లను శుభ్రం చేసి బోర్డులపై కచ్చితంగా వివరాలు నమోదు చేయిస్తాం.

రథోత్సవంలో సేవా కార్యక్రమాలు



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, మే 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో లక్ష్మీచెన్నకేశవ స్వామి రథోత్సవం సందర్భంగా పలువురు భక్తులు శనివారం సేవలందించారు. కొందరు తాగునీరు అందజేయగా, మరికొందరు మజ్జిగ, అన్నప్రసాదాలు అందజేశారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ ఏర్పాటుచేయగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ ప్రారంభించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో భక్తులకు వాటర్ బాటిళ్లను ఏర్పాటుచేయగా వాటిని రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పంపిణీ చేశారు. అదేవిధంగా తొగటవీర క్షత్రియులు, ఆర్యవైశ్య యువజన సంఘం, ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో సేవా సంఘాలు భక్తులకు అన్నప్రసాదాలు, మజ్జిగ, తాగునీటిని అందజేశారు.

కిటకిటలాడిన దుకాణాలు: లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా పలు దుకాణాలు వెలిశాయి. భక్తులను దృష్టిలో ఉంచుకుని పిల్లల ఆటవస్తువులు, మహిళలకు గాజులు, ఇంటి అలంకారానికి ప్లాస్టిక్ వస్తువులు, పుష్పాలలతో పాటు ప్రసాదాల దుకాణాలు వెలిశాయి. రథోత్సవం పూర్తికాగానే పలువురు మహిళలు ఆయా దుకాణాల్లో వాటిని కొనుగోలు చేయడంలో నిమగ్నమయ్యారు.



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన



కళాజాతా నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం, మే 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సరోజమ్మ కళా బృందం వీధి నాటిక ద్వారా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రభుత్వాస్పత్రి సమీపంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలి తదితర వాటిపై వీధి నాటిక ద్వారా ప్రజలకు వివరించారు. ప్రభుత్వాధికారి నజీర్, ఐసీటీసీ కౌన్సెలర్ వనమాల, ల్యాబ్ టెక్నీషియన్ భార్గవి, శక్తిమైత్రి మహిళా సంఘం ప్రాజెక్టు మేనేజర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ భరోసా



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న పరిటాలశ్రీరామ్

ధర్మవరం, మే 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ప్రైవే టు ఆస్పత్రుల్లో చికిత్సలు పొం ది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను సీఎంఆర్ఎఫ్ భరోసాగా నిలుస్తోతందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం 8మందికి రూ.1.93లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పరిటాలశ్రీరామ్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ఆరోగ్యశ్రీ బిల్లులను కూడా చంద్రబాబునాయుడు నాయకత్వంలో చెల్లించిందన్నారు.

నేడు అమరజవాన్‌కు అశ్రునివాళి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ధర్మవరంరూరల్, మే10(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో యుద్ధంలో అమరుడైన జవాన్ మురళీనాయక్‌కు అశ్రునివాళితో అంజలి ఘటించేందుకు టీడీపీ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో కొవ్వొత్తులతో శాంతిర్యాలీ చేపడుతున్నట్లు ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి చింతలపల్లి మహేష్‌చౌదరి అన్నారు. శనివారం పట్టణంలోని గాంధీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం 6 గంటలకు గాంధీనగర్ పార్టీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్, అంజుమన్‌సర్కిల్, కళాజ్యోతిసర్కిల్ మీదుగా తిరిగి గాంధీనగర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేపడతామని తెలిపారు. ప్రజలు, టీడీపీనాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి శాంతిర్యాలీలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు ఫణికుమార్, నాగూర్‌హుస్సేన్, అంబటిసనత్, విజయసారథి, తెలుగుయువత విజయ్‌చౌదరి, గరుడంపల్లి చంద్రశేఖర్, పెద్దచెక్కిరయ్య, అమరసుధాకర్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

కదిరిఅర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధనాలను నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 20వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని శనివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సమ్మెకుసంబదించిన పుస్తకం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఉపాధి పనిదినాలు రెండువందలరోజులకు పెంచాలన్నారు. జీఎల్ నరసింహులు, సాంబశివ, జగన్, రామమోహన్, ముస్తాక్, మాబూన్నీసా, సుజాత, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

రెడ్డివారిపల్లిలో తాగునీటికి కటకట..!



తోటల నుంచి నీరు తెచ్చుకుంటున్న ప్రజలు

అమడగూరు/కదిరి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లిలో ఏర్పాటు చేసిన పంచాయతీ బోరుకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో తాగునీటి సమస్య నెలకుందని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో 150 కుటుంబాలున్నారు. తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని శనివారం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. 15రోజులుగా ఈసమస్య నెలకుందని, గ్రామ సమీపంలోని వ్యవసాయ బోర్లనుంచి తాగునీటి తెచ్చుకోవాల్సి దుస్థితి నెలకుందన్నారు. వేసవిలో పంటలు సాగు ఎక్కువగా ఉండడంతో రైతు కూడా తాగునీరు ఇవ్వలేదని అంటున్నారు. గ్రామానికి తాగునీటి బోరున్నా, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో సమస్యగా మారిందన్నారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ కోసం పంచాయతీ కార్యదర్శి చంద్ర రూ.2.61 లక్షలు గత నెల 13న విద్యుత్ అధికారుల ఖాతాకు జమ చేశామన్నారు. అయినా విద్యుత్ అధికారులు పట్టించుకోలేదని మండిపడ్డరు. దీనిపై ఏఈ చంద్రనాయక్‌ను వివరణ కోరగా ఆ మొత్తం ఖాతాకు జమ అయింది. కానీ ఆ మొత్తం రూరల్ సబ్‌డివిజన్‌లో జమచేయాల్సి ఉంది. దీంతో సమస్య నెలకుంది. సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామన్నారు.



నిరుపయోగంగా ఉన్న తాగునీటి బోరు

అమరవీరుడికి ఘన నివాళి



అమరజవాన్ మురళీనాయక్‌కు నివాళి అర్పిస్తున్న అఖిలపక్షం నాయకులు

పుట్టపర్తిరూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): భారత్, పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన అమరజవాన్ మురళీనాయక్‌కు జిల్లాకేంద్రం పుట్టపర్తి హనుమాన్ కూడలిలో అఖిల పక్షనాయకులు ఘన నివాళులు అర్పించారు. శనివారం సాయంత్రం వారు కొవ్వత్తులతో ర్యాలీ నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, బీజేపీ పట్టణ అధ్యక్షులు కళ్యాణ్, జనసేన బొగ్గరం శ్రీనివాసులు, కాంగ్రెస్ పుట్లగంగాద్రి రామాంజనేయులు, నారాయణ, కత్తిరాజారెడ్డి, నారాయణ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ధర్మవరం : వీర జవాన్ మురళీనాయక్ దేశం కోసం చేసిన సేవలు వెలకట్టలేనివని ఆలిండియా రైతుసంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం పట్టణకార్యదర్శి మారుతి అన్నారు. వీరజవాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఎస్‌హెచ్‌బాషా, జేవీ రమణ, అయూబ్‌ఖాన్, వెంకటస్వామి, ఎస్ఎఫ్ఐ నాగార్జున పాల్గొన్నారు.



కొక్కంటిక్రాస్ వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు, ప్రజలు

తనకల్లు: పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్‌కు టీడీపీ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. శనివారం మండలంలోని కొక్కటిక్రాస్‌లో జవాన్ చిత్రపటం ఉంచి దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీనాయక్‌కు నివాళి అర్పించారు. కన్వీనర్ రెడ్డిశేఖర్, సోంపాల్యం నాగభూషణం, రమణ, ఎంపీడీసీ అమర్‌కార్తికేయ, రమణ పాల్గొన్నారు.

నంబులపూలకుంట: భారత్, పాకిస్థాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు ఎన్డీయూ నాయకులు శనివారం సంతాపం తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసారెడ్డి, చంద్రశేకర్ మాట్లాడుతూ జవాన్ కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు.



గాండ్లపెంటలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజలు

గాండ్లపెంట: వీర మరణం పొందిన మురళీనాయక్‌కు మండల ప్రజలు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. శనివారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.



నల్లమాడలో కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న టీడీపీనాయకులు

నల్లమాడ: దేశ రక్షణలో అమరుడైన వీరజవాన్ మురళీనాయక్‌కు టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. శనివారం బస్టాండ్ ప్రాంతంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో పురవీధుల్లో ర్యాలీ చేశారు. కోట్లో మంజునాథ్‌రెడ్డి, బుట్టి నాగభూషణనాయుడు, పూల రామయ్య, గుండ్ర శివారెడ్డి, షైలే శంకర్, నరసింహ, కేశవరెడ్డి, రామయ్య, మహేష్ పాల్గొన్నారు.



బుక్కపట్నంలో..

పాఠశాలల ఏర్పాటులో అసంబద్ధతను తొలగించాలి



ధర్నాలో పాల్గొన్న ఏపీటీఎఫ్ నాయకులు

పుట్టపర్తిరూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం నూతనంగా ఏర్పాటుచేయనున్న పాఠశాలల్లో అసంబద్ధతలను తొలగించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోనంకి శ్రీనివాసులు, ఆర్. చంద్ర, గౌరవాధ్యక్షుడు మాధవ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈమేరకు శనివారం జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ముందు పాఠశాలల ఏర్పాటులో ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలను నిరసిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు ఉండాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని, బేసిక్ పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:20 ఉండేటట్లు చూడాలన్నారు. ఉన్నతపాఠశాలల్లో 6 నుంచి 10 వతరగతి, 6 నుండి 12వ తరగతి వరకు తరగతులు నిర్వహించేలా చూడాలన్నారు. 45 మంది విద్యార్థులు దాటితే రెండవ సెక్షన్ ఆపైన 35 మందికి అదనపు సెక్షన్ కేటాయించాలన్నారు. 12వ పీఆర్‌సీని నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. జాతీయవిద్యావిధానం విద్యాహక్కుల చట్టంలో పేర్కొన్న మేరకు అన్నిపాఠశాలల్లో మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ ముత్యాలప్ప, రాజశేఖర్, హరిప్రసాద్, రామకృష్ణ, వెంకటనాయుడు, వెంకటరమణనాయక్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు వినియోగించుకోండి

నంబులపూలకుంట, మే 10(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ కార్గో సేవలు వినియోగించుకోవాలని కార్గో కదిరి డీఎంవీ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం కదిరి డిపో పరిధిలోని ఆర్టీసీ పార్సిల్, కొరియర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చుట్టుపక్కల ప్రాంత ప్రజలు, రైతులు తమ సరుకు రవాణా కోసం కార్గో సేవలు వినియోగించుకోవాలన్నారు. దూర ప్రాంతాల రవాణాకు ముందస్తు టికెట్ రిజర్వేషన్ కలదని డిపో మేనేజర్ మైనోద్దీన్ తెలిపారు. ఏజెంటు రామానంద్, ప్రయాణికులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి



లేపాక్షి, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన లేపాక్షి దుర్గా వీరభద్ర పాప నాశేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గా, వీరభద్రస్వాములను ప్రత్యేక పూలతో అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. నిత్యాన్నదాన భవనంలో భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు.

రేపు వెంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం



మడకశిర టౌన్, మే10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వెంకటేశ్వరస్వామి వార్షిక బ్ర హ్మోత్సవాల్లో భాగంగా సోమవారం బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. శనివారం స్వామివారికి విశేష అలంకరణ, ఉదయం తిరుమంజ నం, అంకురార్పణం, ధ్వజారోహణ, యాగశాల ప్రవేశం, క లశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠాప న, శ్రీవారికి అభిషేకాలు జరిగాయన్నారు. ఆదివారం శ్రీవారి కల్యాణోత్సవం, నిత్య హోమాలు ఉంటాయన్నారు. సోమవారం స్వామివారి బ్రహ్మరథోత్సవం, 13వతేదీన పారువేట ఉత్సవం, కలశారాధన, నిత్యహోమం, 14న వసంతోత్సవం, ధ్వజారోహణ, పూర్ణాహుతి, శ్రీవారి శయనోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. వీటిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

గ్రామ కమిటీల ఎంపిక



ఎంపికైన గ్రామ కమిటీ సభ్యులు

మడకశిర రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెళవాయి, కదిరేపల్లి పంచాయతీలకు సంబంధించి టీడీపీ గ్రామ కమిటీల ఎంపిక శనివారం జరిగిందని మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తెలిపారు. మెళవాయి పంచాయతీ అధ్యక్షుడిగా సోమశేఖర్, ఉపాధ్యక్షుడిగా రంగాధమప్ప, కదిరేపల్లి పంచాయతీ అధ్యక్షుడిగా పాండురంగప్ప, ఉపాధ్యక్షుడిగా రంగాధమప్పలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. పార్టీ అభివృద్ధికి గ్రామస్థాయిలో తమ వంతు కృషిచేస్తామని నూతన కమిటీ పేర్కొంది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, మాజీ సర్పంచు నారాయణగౌడ్ పాల్గొన్నారు.

బూత్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన బూత్ కమిటీ

రొళ్ల, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లినమడుగు గ్రామ పంచాయతీ టీడీపీ సంస్థాగత ఎన్నికల కమిటీని శనివారం మండల కన్వీనర్ దాసిరెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా హెచ్‌డిహళ్లి శ్రీరంగప్ప, ప్రధాన కార్యదర్శిగా జీరిగేపల్లి నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జిగా జగన్నాథ్, బూత్ ఇన్‌చార్జిగా నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈరన్నయాదవ్, మాజీ కన్వీనర్ నారాయణప్ప, ఉమేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

- తహసీల్దార్ షెక్షావలి



మెడికల్ క్యాంపులో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

రొళ్ల, మే 10(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ షెక్షావలి సూచించారు. శనివారం జీజీహట్టిలో నిర్వహిస్తున్న మెడికల్‌క్యాంపును ఆయన పరిశీలించారు. అతిసారకు గురైన వ్యక్తుల వివరాలను, వారి పరిస్థితిని అక్కడి వైద్య సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోరుబావి నీటిని తాగరాదని, ఫిల్టర్ నీటిని, కాచి వడగట్టి తాగాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా వయోవృద్ధులు, గర్భవతులు, బాలింతలు, ఎండ తీవ్రత దృష్ట్యా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇంటి బయట నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, ఐసీడీఎస్ సీడీపీఓ నాగమల్లేశ్వరి, సూపర్‌వైజర్ సన్నక్క, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

హిందూపురం, మే 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీబీ కాలనీలో మహిళమెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పాత ఆర్టీఓ కార్యాలయం సమీపంలో కాంతమ్మ ఇంటి వద్ద ఉండగా గుర్తుతెలియని దుండగులు ద్విచక్రవాహనంలో వచ్చి బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు.

అమరవీరుడికి ఘననివాళి



బెంగళూరు విమానాశ్రయంలో మురళీనాయక్ పార్థివ దేహం వద్ద సెల్యూట్ చేస్తున్న మంత్రి సవిత

భారత్-పాకిస్థాన్ యుద్ధంలో అసువులు బాసిన మురళీనాయక్‌కు ఘననివాళులు అర్పిస్తున్నారు. మురళీనాయక్ వీరోచిత పోరాటపటిమకు సెల్యూట్ చేస్తున్నారు. కొవ్వొత్తులతో ర్యాలీచేస్తున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జై జవాన్... భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తున్నారు.

పురంలో కొవ్వొత్తుల ర్యాలీ

హిందూపురం, మే 10(ఆంధ్రజ్యోతి): వీరజవాన్ మురళినాయక్‌ను స్మరిస్తూ శనివారం రాత్రి హిందూపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్ నుంచి సద్భావనా సర్కిల్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మురళినాయక్ అమర్ రహే అంటూ భారత్‌మాతకి జై అంటూ నినాదాలుచేశారు. ఈ కార్యక్రమంలో బహుజన చైతన్యవేదిక ఎస్సీఎస్టీ విభాగం, లైఫ్‌వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

ఆటోకార్మికుల ఆధ్వర్యంలో...

పెనుకొండ, మే 10(ఆంధ్రజ్యోతి): అమరవీరుడు మురళినాయక్‌కు పెనుకొండ దర్గా సర్కిల్ బాబా ఆటో స్టాండ్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళినాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాబావలి, గంగాధర్, అల్లి, మహబూబ్‌బాష, సత్తార్, బాబా, అమన్, ఇనాయత్, తదితరులు పాల్గొన్నారు.



ఆటో కార్మికుల ఆధ్వర్యంలో నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ముస్లింల నివాళి

పావగడ, మే 10(ఆంధ్రజ్యోతి): ఇండియా-పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన మురళినాయక్‌కు పావగడ పట్టణంలోని జామియా మసీదు పెద్దల సమక్షంలో ఘనంగా నివాళులు అర్పించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వారు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. నివాళులు అర్పించిన వారిలో జామి మసీదు పెద్దలు ముబారక్, అర్‌టిఖాన్, షాబాబు, నిజాంఅలీ, గౌస్‌ముద్దీన్, సాదిక్, షఫీ, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.



నివాళులు అర్పిస్తున్న ముస్లింలు

జవాన్లకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ



తెలుగుతల్లి సర్కిల్ వద్ద మానవహారం

పెనుకొండ, మే 10(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్ సైన్యంతో వీరోచితంగా పోరాడుతున్న ఇండియన్ ఆర్మీ జవాన్లకు మద్దతుగా స్థానిక విశ్వ హిందూపరిషత్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. శనివారం రాత్రి వీహెచ్‌పీ నాయకులు, హిందూసంఘం నాయకులు, ప్రజలు, విద్యార్థులు బ్యానర్లతోపాటు 50అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ పట్టణంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కాశీవిశ్వేశ్వర ఆలయం నుంచి ఎస్‌కెడి సర్కిల్, ట్యాంక్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా తెలుగుతల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలువేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఆపరేషన్ సింధూర్‌తోపాటు పాకిస్తాన్ ముష్కర చేతుల్లో మరణించినవారికి ఆపరేషన్ సింధూర్ పోరాటంలో మృతిచెందిన వీరజవాన్ మురళినాయక్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయంలో యుద్ధంలో విజయాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జవాన్లకు అండగా నిలవాలి: బీజేపీ నాయకులు

పెనుకొండ రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు భారత జవాన్లకు అండగా నిలవాలని బీజేపీ నాయకులు ఎనుమల రామక్రిష్ణ, రామాంజినేయులు సూచించారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో వీరమరణం పొందిన మురళినాయక్ చిత్రపటానికి బీజేపీ నాయకులు నివాళులు అర్పించారు. ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రామాంజినేయులు, రవి, ముత్యాలమ్మ, సుబ్రమ్మ, రామక్రిష్ణ గోవిందు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

సైనికుల కోసం ప్రత్యేక పూజలు

హిందూపురం, మే 10(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌లో విజయం సాధించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం బీజేపీ పట్టణాధ్యక్షురాలు అంజలి, నాయకుడు రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. యుద్ధంలో మన దేశం విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరి, అమర్‌దేవేంద్ర, మేడకుర్తి హరి, భాగ్యలక్ష్మీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

శోకించిన పాఠశాల

సోమందేపల్లి మే 10(ఆంధ్రజ్యోతి): వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు అతడు చదివిన సోమందేపల్లిలోని పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ మల్లికార్జున, హెచ్‌ఎం కృష్ణవేణి తదితరులు మురళీనాయక్ చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి, నివాళులర్పించారు. అనంతరం అతను పాఠశాలలో చదివేటప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. క్లాస్‌మేట్‌లు మురళితో ఉన్న అనుబంధాన్ని వివరించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మురళీనాయక్ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. అనంతరం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, విద్యార్థులు

బృందంగా ఏర్పడి కళ్లితండాకు బయలుదేరి వెళ్లారు.



స్వగ్రామానికి పార్థివదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

అర్ధరాత్రయినా తగ్గని రద్దీ

ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన మురళీనాయక్ పార్థివ దేహాన్ని శనివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో వీరజవాన్ స్వగ్రామమైన కళ్లితండాకు చేరుకుంది. అర్ధరాత్రి వరకూ జనం రద్దీ కొనసాగింది. గుమ్మయ్యగారిపల్లి క్రాస్ వద్ద నుంచి పార్థివ దేహం వాహనం ముందు భారీగా జనం తరలి వచ్చారు. తండా పొలిమేరల్లోకి రాగానే పోలీసులు వందనంతో పార్థివ దేహాన్ని మురళీనాయక్ ఇంటి సమీపం వరకు తీసుకెళ్లి కొద్దిసేపు ఉంచారు. పార్థివ దేహం ఇంటి వద్దకు చేరుకోగానే తల్లిదండ్రులు శ్రీరామనాయక్, జ్యోతిబాయి, బంధువులు, స్నేహితులు ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి. అక్కడ నుంచి ప్రజల సందర్శనార్థం ఏర్పాటుచేసిన టెంటు వద్దకు తీసుకెళ్లారు.

వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యం

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ● సీఎం ఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మడకశిర టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాష్ట్రంలో, నియోజకవర్గంలో దండుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు చేసిన మేలు శూన్యం అని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలసి సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. 28మంది లబ్ధిదారులకు రూ,11లక్షల చెక్కులను పంపిణీ చేశారు. వైసీపీ పాలనలో ఏ ఒక్క పేదవాడికీ సాయం చేసింది లేదన్నారు, నియోజకవర్గ అభివృద్ధి గురించి పూర్తి మరిచారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి రాగానే అటు అభివృద్ధి ఇటు సంక్షేమ దిశగా రాష్ట్రం వెళుతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, జడ్పీటీసీ సభ్యులు ఉమేష్, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, నాయకులు పాండురంగప్ప పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

నోరు అదుపులో పెట్టుకో

ఉష శ్రీచరణ్‌కు టీడీపీ నాయకుల వార్నింగ్



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఉషశ్రీ నోరు అదుపులో పెట్టుకోవాలని టీడీపీ నాయకులు సూచించారు. కళ్యాణదుర్గంలో అక్రమాలు, అవినీతికి పాల్పడి అక్కడి ప్రజలు ఛీకొడితే పెనుకొండకు వచ్చి పడ్డారని ఎద్దేవా చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు, నాయకులు సిద్దయ్య తదితరులు మాట్లాడుతూ కుట్టుమిషన్ల పంపిణీలో పెద్ద స్కాం జరిగిందని ఉషశ్రీ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. శిక్షణనే పూర్తి కాలేదని, అప్పుడే స్కాం జరిగినట్లు పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాలను విడతలవారీగా అమలు చేయడం జరుగుతోందన్నారు. వైసీపీ పాలనలో రూ. 10 లక్షల కోట్లు ప్రజలపై భారం వేయడం జరిగిందన్నారు. ఆ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. మంత్రి సవిత నియోజకవర్గవ్యాప్తంగా రూ.30కోట్లతో సిమెంటు రోడ్లు, గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు, గ్రామాల్లో తారు రోడ్లు, ఇతర వసతులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అది ఓర్వలేక పెనుకొండకు వచ్చి కుట్టుమిషన్ల పంపిణీలో స్కాం జరిగిందనడం విడ్డూరంగా ఉందన్నారు. ఉషశ్రీ కోరినట్లు బహిరంగ చర్చ కళ్యాణదుర్గంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎనుమల రామక్రిష్ణ, త్రివేంద్ర, బాబులొరెడ్డి, రంగనాయకులు, సోము, రమణమ్మ, సిద్దలింగప్ప, సప్తగిరి శోభన్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

అగళి, మే 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. సోమవారం నుంచి 19వ తేదీ వరకు ఫస్టియర్, సెకెండియర్ పరీక్షలు ఉంటాయన్నారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో 101, సెకెండియర్‌లో 59మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ వివరించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

అగళి, మే 10(ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి సంబంధించి బీసీ సంక్షేమ శాఖ ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని, అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని అగళి బీసీ బాయ్స్ హాస్టల్ వార్డెన్ సికిందర్‌బాషా సూచించారు. ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. బీసీ, ఓబీసీ, కేటగిరికి చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, టెట్ క్వాలిఫై అయిన సర్టిఫికెట్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, రెండు ఫోటోలను జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

నేడు ప్రేమాభిషేకం నాటకం ప్రదర్శన

అమరాపురం, మే 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కనకనపల్లి గ్రామంలో ప్రేమ అభిషేకం కన్నడ సామాజిక నాటికను ప్రదర్శిస్తున్నట్లు టీడీపీ యువ నాయకుడు బీసీసెల్ తాలూకా ఉపాధ్యక్షుడు మంజుతారక్ తెలిపారు. కన్నడ సామాజిక నాటక ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరవుతారన్నారు. మండలంలో కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని నాటికను చూడాలని కోరారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

హిందూపురం, మే 10(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తూముకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం నాయకులు కోరారు. శనివారం పారిశ్రామికవాడలో ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెకు సంబంధించి కరపత్రాలను విడుదలచేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు రవికుమార్ మాట్లాడుతూ సమ్మె రోజున పారిశ్రామికవాడలో ర్యాలీ జరుపుతామన్నారు. అన్ని పరిశ్రమలకు సమ్మె నోటీసును అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ నాయకులు వినోద్, మారుతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

పెనుకొండ, మే 10(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయుసీ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండువద్ద సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆటో కార్మికులు విడుదల చేశారు. సమ్మెలో అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూటీఏఫ్ నాయకులు సనావుల్లా, నిర్మల్‌కుమార్, ఇంతియాజ్, హబీబ్, ఖాదర్‌బాష, చాంద్‌బాష పాల్గొన్నారు.

గుడిబండ పీహెచ్‌సీ తనిఖీ

గుడిబండ, మే 10(ఆంధ్రజ్యోతి): మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఫిరోజ్‌బేగం శనివారం తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని రికార్డులు, మందులను పరిశీలించారు. ఆమె వెంట వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనుకొండ, మే 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అశేష సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.